తాను మబ్బుల్లోకి వెళుతూ, అరవింద జీవితాకాశానికి చంద్రకాంతి నిచ్చిన చంద్రకాంత జాలికథ.

వెన్నెల కురుస్తోంది. చెట్ల నీడల మధ్యనుంచి, అరవింద బరువుగా అడుగులు వేసుకుంటూ నడుస్తోంది. విరిసిన గులాబీలు, పువ్వుల అందాలు చూచి ముగ్ధురాలయే అరవింద ఈ రోజు ఏమాత్రమూ ప్రభావితురాలు కాలేకపోతోంది. ఎప్పుడూ చంద్రకాంతే తనను వెంటాడుతున్నట్లుంది.

ప్రకృతిలోని ప్రతి అణువులోనూ చంద్రకాంతే కనుపిస్తోంది. నందనవనంలాంటి ఆసుపత్రి గార్డెను అంతా చంద్రకాంతే ఆక్రమించుకుంది. చచ్చిపోవడంకూడా ప్రకృతిలోని భాగమే! ఆలోచనా పరంపరలలో మునిగిపోయిన అరవింద ఒక సిమెంటు తిన్నెమీద కూర్చుంది.

చంద్రకాంత ఆసుపత్రిలోచేరి మూడు నెలలు అయింది. ఆమె హృద్రోగి. ఆమెతోపాటు ఆసుపత్రిలో చేరిన ముగ్గురమ్మాయిలు గుండె ఆపరేషను అయి బాగున్నారు. చంద్రకాంత వారందరికంటే బలమైన చురుకుగా, నిర్భయంగావుంటుంది. పొట్టిగా బొద్దుగా ఘల్లు ఘల్లుమంటూ నడుస్తూవుంటె 'మధుమతి' సినిమాలో వైజయంతిమాల జ్ఞాపకం వచ్చేది.


నా అన్న వాళ్ళు లేకుండా మూడునెలల నుంచి చంద్రకాంత ఒక్కతే వుంటోంది ఆసుపత్రిలో. తనప్రక్కనవున్న రోగులను చూడడానికి ప్రతిరోజూ వారిదగ్గర బంధువులు దూరపు బంధువులు వచ్చిపోతూవుంటే తనకోసం ఎవ్వరూ రాలేదని కూడా బాధపడేదికాదు. పైగా ఆ వచ్చిన వారందరితోనూ పరిచయమూ, స్నేహమూ చేసుకుని వారు తననేముందు పలుకరించేట్లు చేసుకున్నది. తోచినవారు పండో ఫలమో తెచ్చి చంద్రకాంతకు యిచ్చి పోతూ వుండేవారు. ఆమెను చూచి జాలిపడేవారు. ప్రక్క బెడ్‌మీద వున్న సుమిత్ర వాళ్ళ అన్నయ్య చంద్రకాంత అంటే ప్రత్యేక అభిమానం చూపుతూ వుండేవాడు. చంద్రకాంత ఓర చూపులు చూస్తూ గుండెల్లోని సిగ్గు దొంతర్లను దాచుకుంటూ వుండేది. ఇద్దరూ కలిసి అలా గార్డెన్‌లోకి షికార్లు పోయివస్తూ పేక ఆడుకుంటూ వుండేవారు.

ఈరోజు చంద్రకాంత ఆపరేషను బల్లమీదే చచ్చిపోయింది. అన్న వార్త విన్న దగ్గరనుంచి అరవింద ఆసుపత్రిలో నిలువలేకపోతోంది. కాళ్ళు వణికాయి. స్పృహ తప్పి పడిపోతానని భయం! వెంటనే స్టాఫ్ రూమ్‌లోకి వెళ్ళి కూలబడిపోయింది. కారణం చంద్రకాంతలోని ఔన్నత్యమా? కాదు. ఆమె లేనిదే లోకానికి తీరనిలోటా? అదీ కాదు.

అరవింద నర్సుగా చంద్రకాంతకు సేవచేసింది. కొన్నాళ్ళుగా ముఖ పరిచయం వున్నది. అందువలన వీరిద్దరికి ఒక అవినాభావ సంబంధం ఏర్పడి వుండవచ్చు. అయినా ఆసుపత్రిలో ఎంతమంది రోగులు లేరు? ఎంతమందికి తను నర్సుగా సేవ చేయలేదు? ఎంతోమంది నయం అయి వెళ్ళారు. కొంతమంది చచ్చిపోయారు కూడాను. ఆసుపత్రిలో నిత్యమూ ఎంతో మందిచస్తూ వుంటారు, పుడుతూవుంటారు. చచ్చిన ప్రతివారికోసం బాధపడుతోందా? పుట్టిన ప్రతి జీవిని చూసి ఆనందిస్తోందా? ఈ జీవన్మరణాలకు అతీతమైన వేదాంతిలాగా తను తన డ్యూటీ నిర్వర్తించుకుంటోంది అరవింద.

అటువంటిది ఈ రోజు అరవింద గుండెలు పగిలిపోతున్నాయి. జీవించి వుండడానికీ, చనిపోవడానికీ మధ్యన ఒక్కక్షణమే తేడా!! ఎప్పుడో ఒకరోజున అందరూ వెళ్ళిపోవలసినదే. కానీ నిన్నటి వరకూ నవ్వుతూ తుళ్ళుతూ నలుగురి మధ్యనవున్న చంద్రకాంత ఈ రోజు లేదు అని వూహించుకోవడం కూడా కష్టంగా వుంది అరవిందకు. మృత్యుముఖంలో వున్న చంద్రకాంతకూడా యింత బాధపడి వుండదు.

అరవిందలో అంతర్లీనంగా అణిగి వున్న శక్తి ఏదో ప్రేరేపిస్తోంది. ఆ ప్రేరణాశక్తిముందు ఆమె నిలబడలేకపోతోంది. ఫ్లారెన్స్ నైటింగేల్‌లాగా జీవితమంతా దుఃఖితులకు, దీనులకు సేవ చేస్తూ గడిపివేయాలన్న ఆమె ఆశయాలన్నీ వీగిపోతున్నాయి. మృత్యుదేవత చేసే విలయతాండవంముందు ఈ జీవితానికి అర్థం ఏమిటో ఆమెకు బోధపడడం లేదు. జీవితం అమూల్యమైనది, అతి విలువైనది. ఆ విలువ తెలుసుకునే దెంతమంది? ఏదో చావలేక బ్రతుకుతున్నట్లు బ్రతికేస్తూ వుంటారు. తనూ అంతే! జీవచ్ఛవాలలాగా బ్రతుకుతున్న వారందరూ ఆమె కళ్ళముందు మెదిలారు. సంఘం మృత్యుదేవతకంటే భయంకరంగా ఆమెకు కనిపించింది.



అరవిందకు చిన్నతనంలోనే పెండ్లయింది. పెండ్లి అవగానే ఆమె భర్త ఆ కట్నం డబ్బులు పుచ్చుకుని విదేశాలకు పై చదువులకని వెళ్ళాడు. కాలం కర్మ వశాత్తు అతను అక్కడ ఎవరినో ప్రేమించాడు కాబట్టి అక్కడే స్థిరపడిపోయి ఆమెతో వుండిపోయాడు. అరవింద బ్రతుకు ఇలా అధ్వాన్నమయిందని అందరూ చెప్పుకున్నారు. ఎంతోమంది దీనికే చిలవలు పలవలు అల్లి వింతగా, విడ్డూరంగా చెప్పుకున్నవారే కాలక్రమేణా ఈ విషయం మరిచిపోయారు.

ముక్కుపచ్చలారని అరవిందకు ఈ విషయం చాలా కాలానికిగాని తెలియలేదు. తనకు జరిగిన తీరని అన్యాయాన్ని తలుచుకుని వాపోయే స్థితి రాకమునుపే ఆమెను నర్సు ట్రెనింగ్ పాసు చేయించారు తల్లిదండ్రులు. కారణం భర్త బ్రతికి వుండగా స్త్రీకి పునర్వివాహం చేయడం అనేది హిందూదేశంలో అసంభవమైన విషయం. వూహించరానటువంటి ఘోర సంఘటన. కనుక అరవింద జీవితం ఆదర్శప్రాయంగా మానవసేవలో గడవడమే పునీతమైనదిగా


# చంద్రకాంత

ఎస్. ప్రసూన

ఎల్లరూ తీర్మానించి చదివించారు.

జీవితం ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో ఎవరెరుగుదురు? ప్రకృతి ధర్మాన్ని అధిగమించడం అందరికీ చేతకాదు.

ఆసుపత్రిలో కొత్తగా హౌస్‌సర్జనుగా చేరిన రాజారావు అరవిందకు పరిచయమైనాడు. సున్నితమైన ఆమె మనసు, సేవా తత్పరత, మృదు స్వభావము అతనిని ఎంతో ఆకర్షించాయి. అటువంటివారు ప్రపంచంలో ఏ కొద్దిమందో వుంటారు అనుకున్నాడు. ఆమె సహాయంతో తను కూడా తన డాక్టరువృత్తి ఆదర్శవంతంగా నిర్వహించాలని కలలు కనడం మొదలుపెట్టాడు. ప్రతి చిన్న విషయానికీ ఆమె సలహా పొందుతూ, తీరికైనప్పుడల్లా ఆమెతో మాట్లాడుతూ, ఆమెను తనతో మాట్లాడేట్లు చేసుకుంటూ అప్పుడప్పుడూ ఆమెతో కలిసి అలా వెడుతూ వుండేవాడు. ఎంతసేపూ జీవితంలో వున్నత ఆశ



## దీపా అక్కినేని ఫొటో

మీకు కావాలా? అయితే ఈ క్రింది అడ్రసుకు 4 రూ॥లు ఎం. ఓ. చేయండి. వెంటనే "పల్లె జమీందార్" చిత్రంలోని దీప, అక్కినేని వున్న కార్డు సైజు ఫొటోతోపాటు 1980 సినీడైరీ కూడా పంపబడును. డబ్బు కవరులో పెట్టి పంపకూడదు. ఎం. ఓ. ద్వారానే పంపాలి.

వై. కె. మూర్తి,
దాసరివారి వీధి, విజయవాడ-2.

## తెల్ల వెంట్రుకలు

మమ్ము మేము పొగుడుకోవటం యిష్టం లేదు. మా ఆయుర్వేదిక్ "కేశకాంతి" హెయిర్ ఆయిల్ తెల్ల వెంట్రుకలను నలుపుగా మార్చును. ధర రు. 10/- 3 సీసాలు రు. 27/- ఇంగ్లీషు లేదా హిందీలో ఆర్డరు పంపండి.

Vijoy Commercial Co (B.H.18)
P. O. KATRISARAI (GAYA)

## వధువు కావలెను

అందం, సంపద, ఉద్యోగము గల స్మార్త బ్రాహ్మణ Graduate (29 సం, 5 అ, 8 అం)తో లాభసాటి వ్యాపారము మొదలు పెట్టించగల అమ్మాయి తల్లిదండ్రులు పూర్తి వివరాలతో Box No. 1114, C/o Andhra Jyothi, weekly. Vijayawada-10 కు వ్రాయండి. శాఖాంతరమైనా ఫరవాలేదు.

ఉచితం ఉచితం ఉచితం

## తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండిపోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.

Address
Jeevan Kalyan (B.D-8)
(P. O) Katri sarai (Gaya)

యాలు. ఆశలమీద మాట్లాడుకుంటూ వుండేవారు.

రాజారావుకు అరవిందను చూస్తే ఎంతో జాలివేసేది. వెర్రిమొర్రి ఆదర్శాలతో అమూల్యమైన జీవితం వృధా చేసుకుంటోంది అని సానుభూతి చెందేవాడు. ఆమె భర్త విదేశాలలో స్థిరపడి భార్యతో సుఖిస్తూ వుంటే ఈమె ఎందుకిలా వుండిపోవాలి? కేవలం భారతదేశంలో పుట్టబట్టి గదా? మరో దేశంలో అయితే సంఘం వ్యక్తిగత సుఖాలకు అడ్డుపడి యింతగా సంకెళ్ళు విధించి వుండి వుండేదికాదు.

రాజారావు యెన్నిచెప్పినా, ఎంత కొత్త పంథాలో ఆలోచించినా అతని వూహలు అరవిందకు నచ్చేవికావు. భారతీయ సంస్కృతిని యిప్పటివరకూ నిలబెట్టింది భారతీయ స్త్రీలేగాని పురుషులు కాదు అని వాదించేది. భారతనారి చేయగలిగిన త్యాగం ప్రపంచంలో ఏ స్త్రీ చేయలేదు అనేది.

"సంఘాన్ని యెదిరించి, సుఖంగా బ్రతకడానికి ధైర్యంలేక త్యాగం, ధర్మం అంటూ తలుపులు అడ్డు వేసుకుంటున్నారు. తరతరాలుగా జీర్ణించుకుపోయిన ఈ ధర్మోపదేశాల నుంచి భారతదేశం ఎన్నడు కోలుకుంటుందో! అరవిందలాంటి ఆడపిల్లలు ఈ భారత దేశంలో ఎన్నడు స్వేచ్ఛగా గాలి పీల్చుకుంటారో, ఆ రోజు ఎప్పుడు వస్తుందో!" అంటూ రాజారావు ఆవేశపడుతూ వుండేవాడు.

అటువంటప్పుడు అరవింద కొంచెం చలించేది. స్థిరపడిన ఆమె భావాలు కదిలినట్లయేది. అతను చెప్పేదాంట్లో నిజం వున్నదనికూడా అనిపిస్తూ వుండేది. అతని మాటల్ని పూర్తిగా తోసివేయలేకపోయేది.

ఉన్నట్టుండి ఒకరోజున అలా సాయంత్రం షికారుకి వెళ్ళినప్పుడు రాజారావు అరవిందను ప్రేమిస్తున్నాననిచెప్పేశాడు. ఆమె ఉలిక్కిపడింది. ఇటువంటిది ఏమైనా జరుగుతుందేమోనని ఆమెకు భయంగానే వుంది. అలా జరుగకుండా జీవితం పవిత్రంగా వెళ్ళిపోవాలని కోరుకుంటున్న అరవింద నిరాంతపోయి, నిశ్చేష్టురాలై అలాగే చతికిలబడింది. వివాహితురాలయిన స్త్రీని ఎవరైనా ప్రేమించడం లేదా, అట్టి స్త్రీ పరాయివారి నెవరినైనా కోరుకోవడం జరిగితే వారు రౌరవాదినరకాలకు వెడతారని ఆమె ఎక్కడో చదివింది.

రాజారావు ఈ పురాతన భావాలను ఖండించాడు. అటువంటి పాతకం, నరకం ఏమయినా వుంటే అదంతా తను ఒక్కడే భరిస్తానని భగవంతునికి స్టాంపు మీద రాసి యిస్తానని అరవిందకు హామీ యిచ్చాడు. తీవ్రంగా వాదించాడు. "మనిషిని సృష్టించిన దేవుడు జీవితంసుఖంగా, ఆనందమయంగా గడుపుకోమని సృష్టించాడుగాని, నరకతుల్యంగా, దుఃఖభాజనం చేసుకోమని సృష్టించలేదు" అంటూ ఆమెను సమాధానపర్చడానికి ప్రయత్నించాడు.

అరవిందకు తనఆశయాలమీద, జీవితంలోని పవిత్రతమీద వున్న తృప్తితో ఈ ఆవేశపూరితమైన రాజారావు మాటలకు చలించలేదు. బూజుపట్టిన ఆమె భావాలను యిక దులపలేననే నిర్ణయానికి వచ్చిన రాజారావు నిరాశచెందాడు. తన హౌస్ సర్జను పని పూర్తి అయింది. అరవిందకు తన ఎడ్రసు యిచ్చి అతను వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయాడన్న మాటేగాని ఆ వివాదాలు ఎప్పుడూ ఆమె చెవుల్లో రింగుమని మారుమ్రోగుతూ వుండేవి. ఆమె గుండెల్లో చెరగని ముద్రగా వుండిపోయాడు. ఎంతటి వాటినైనా మరిపింపచేసేకాలానికి ఈ ముద్రలు చెరిపే శక్తి లేదు.

ఈరోజు చంద్రకాంత చచ్చిపోయింది. మృత్యుదేవత ఆమెను ఈ లోకాన్నుంచి తీసుకుపోయింది. పరలోకంలో ఏముందో తనకు తెలియదుగాని ఈ లోకంలోని సుఖాన్నే తను అందుకోలేకపోతోంది. చంద్రకాంత బ్రతికి వుంటే మాత్రం తనలాగా ఎప్పుడూ చేసేదికాదు. తనకు వున్నంత వేదాంత జిజ్ఞాస ఆమెకు లేకపోయినా హాయిగా బ్రతకడం చేతనౌను. జీవితం సుఖంగా, ఆనందంగా బ్రతకడానికే అన్న రాజారావు వెర్రివాడు కాదు! రాజారావు సిద్ధాంతాన్ని మనసులో కూడా కాదనలేకపోయింది అరవింద.

ఆ మరునాడు తన నర్సు వుద్యోగానికి రాజీనామా యిచ్చి రాజారావు దగ్గరకు వెళ్ళింది అరవింద. సంగతంతా విన్న రాజారావు కలలు పండాయనే ఆనందోత్సాహంతో "చంద్రకాంత జీవితంలో కంటే ఆమె మృత్యువులో నీవు జీవితం విలువ తెలుసుకున్నావన్న మాట! చంద్రకాంతకు ధన్యవాదాలు. ఆమె ఆత్మ శాంతించుగాక!" అంటూ అరవిందను తొలిసారిగా దగ్గరకు తీసుకున్నాడు. ●